విత్తనాల ఎంపిక, సాగు పద్ధతులతో అధిక లాభాలు


మాడ్గులపల్లిలో డ్రాగన్‌ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న డీలర్లు

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: నాణ్యమైన విత్తనాల ఎంపిక, నూతన సాగు పద్ధతులతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని డీఏఈఎస్ఐ(డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్) ఫెసిలిటేటర్ కృష్ణయ్య అన్నారు. వ్యవసాయ విస్తరణ సేవల్లో భాగంగా కేవీకే కంపసాగర్ ఆధ్వర్యంలో ఉత్పత్తి పంపిణీదారుల శిక్షణ తరగతుల్లో భాగంగా మాడ్గులపల్లి పరిధిలోని రైతు తండు సైదులుగౌడ్ వ్యవసాయ క్షేత్రాన్ని మంగళవారం సందర్శించారు. డ్రాగన్‌ఫ్రూట్‌తో పాటు, శ్రీగంధం, మామిడి, బత్తాయి తోటలను పరిశీలించి, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. విత్తనాల ఎంపిక, సాగు చేసిన పద్ధతులు, ఉత్పత్తుల లాభాల గురించి రైతును అడిగి తెలుసుకున్నారు.

డిజిటల్ కార్డుల సర్వేకు బృందాల ఏర్పాటు: కలెక్టర్

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వం ప్రయోగాత్మకంగా అమలు చేయనున్న కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు సర్వేకు తక్షణమే బృందాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన వివిధ శాఖల జిల్లా అధికారులతో మాట్లాడారు. 150 కుటుంబాలకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం వరకు ఆయా బృందాలు క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించాలని స్పష్టం చేశారు. పుర కమిషనర్లు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. 15 రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు పడక గదుల ఇళ్ల వివరాలు సమర్పించాలన్నారు. దసరా నాటికి లబ్ధిదారులను గుర్తించి పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు 3న సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు.

బాపూజీ మాటే.. చైతన్య బావుటా

◆ నేడు మహాత్మాగాంధీ జయంతి

అహింస, శాంతి అనే రెండు ఆయుధాలతోనే రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి.. దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టిన జాతిపిత మహాత్మాగాంధీ. నేటి సమాజానికి ఆయన సూచించిన అహింస, మహిళా సాధికారత, స్వచ్ఛత బాట మనకు ఎంతో అవసరం. నేడు 'మహాత్మాగాంధీ జయంతి' సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం. మిర్యాలగూడ పట్టణం, మేళ్లచెరువు, న్యూస్‌టుడే:

స్వచ్ఛతతోనే ఆరోగ్య సిరులు

మహాత్మాగాంధీ కలలు గన్న అంశాల్లో ప్రధానమైనది స్వచ్ఛత. ఆయన ఆశయాల సాధనలో భాగంగా సరిగ్గా పదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాన్ని ప్రారంభించింది. పలు నగరాలు, పట్టణాల్లో మురికివాడలు, వాటిలో నివసించే పేదల అభ్యున్నతే గాంధీజీ ధ్యేయం. ప్రస్తుత సమాజంలో చైతన్యం కరవై.. అధికారుల్లో నిర్లక్ష్యం అధికమై స్వచ్ఛత కనుమరుగైంది. దీంతో ఇటీవల ఉమ్మడి జిల్లాలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారి.. దోమలు వ్యాప్తి చెంది వేలాది మంది విషజ్వరాల బారిన పడ్డారు. స్వచ్ఛతలో నల్గొండ పురపాలిక ఇటీవలే జాతీయ స్థాయిలో రెండో బహుమతి సాధించింది. నల్గొండ పురపాలికను ఆదర్శంగా తీసుకుని మిగతా పట్టణాల్లో ప్రజలు, అధికారులు సంఘటితంగా స్వచ్ఛతను పాటిస్తే పరిసరాలు పరిశుభ్రమవుతాయి. గాంధీజీ ఆశయం నెరవేరుతుంది.

> మీరు చీపురు, బకెట్ మీ చేతుల్లోకి తీసుకోనంత వరకు.. మీ పట్టణాలు, నగరాలను శుభ్రం చేయలేరు

ప్రధాన పట్టణాల్లో నిత్యం సేకరించే ప్లాస్టిక్ వ్యర్థాలు (కిలోల్లో)..

పట్టణం	ప్లాస్టిక్ వ్యర్థాలు..
నల్గొండ	150
సూర్యాపేట	40
మిర్యాలగూడ	30
యాదగిరిగుట్ట	40

> నీతిలేని వాణిజ్యం, కృషిలేని సంపద, శీలం లేని విద్య, త్యాగంలేని ఆరాధన, మానవత్వం లేని శాస్త్రజ్ఞానం, నియమనిష్ఠలు లేని రాజకీయం.. ఇవే సామాజిక పాపాలు." - మహాత్మా గాంధీ

మహిళా సాధికారతే లక్ష్యం

స్వాతంత్ర్యోద్యమంలో కీలకంగా వ్యవహరించిన మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి సాధిస్తే ఆ దేశం ప్రగతి పథంలో వెళ్తుందని గాంధీజీ నమ్మకం. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని మహిళలు పలు రంగాల్లో రాణిస్తు.. మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలో స్వర్ణభారతి సహకార పరపతి సంఘం ఘనతే ఓ ఉదాహరణ. అక్కడ 17 గ్రామాల్లో మహిళల సమైక్య జీవన సౌందర్యం ఉట్టిపడుతోంది. వారి ఐక్యత రూ.30 కోట్ల లావాదేవీలకు ఊతమిచ్చింది. కొన్నేళ్ల కిందట ఆ మగువలంతా నిరుపేదలే. పూట గడవని స్థితి నుంచి పిల్లల్ని ఉన్నత చదువులు పంపే స్థాయికి ఎదిగారు.

> మహిళలు మేధోపరంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా పురుషులతో సమానంగా ఉంటారు. వారు స్వతంత్రతో, ఆత్మవిశ్వాసంతో ఉండేలా విద్యావంతులను చేయాలి. వారికి ఆర్థిక స్వాతంత్ర్యం అందించేందుకు వివిధ నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వాలి


ఉమ్మడి జిల్లాలో మహిళా సంఘాల సభ్యుల వివరాలు..

జిల్లా/పట్టణం	సభ్యులు
నల్గొండ	2,83,000
సూర్యాపేట	1,76,250
యాదాద్రి	1,49,490
కోదాడ	30
భువనగిరి	20



ప్రతినబూనుదాం

ఏ ఆయుధంతోనైతే మహాత్ముడు దేశానికి స్వేచ్ఛా, ఊపిరిలూదారో.. ఆ ఆయుధమైన అహింస నేటి సమాజంలో కనుమరుగవుతోంది. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని ఏటా అక్టోబరు 2న 'అంతర్జాతీయ అహింసా దినోత్సవాన్ని' నిర్వహించుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని కొందరు యువత దుర్వ్యసనాలతో చదువులను అర్ధంతరంగా ఆపేసి.. మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. ఆర్థిక అవసరాలు తీర్చలేదని విచక్షణ రహిత దాడులకు దిగుతున్నారు. మత్తులో విచక్షణ కోల్పోయి తల్లిదండ్రుల ప్రాణాల్నే తీస్తున్న ఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి.



> సత్యం, అహింస నా మతం. నిజాన్ని దైవంగా భావిస్తా.. అహింస రూపంలో దేవుడిని దర్శిస్తా

★ ఇటీవల మిర్యాలగూడలోని ఓ కాలనీలో 12 ఏళ్ల బాలుడు.. ఐదేళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించడంతో పెద్దలు.. రాయబారం నడిపి రాజీ కుదిర్చారు. ఆ కాలనీలో యువత నిత్యం మత్తు పదార్థాలు తీసుకుంటూ.. చేస్తున్న చర్యలే ఆ బాలుడికి ప్రేరణగా నిలిచాయని స్థానికులు చెబుతున్నారు. అహింసా వాదాన్ని ప్రేరేపించే చర్యలను పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలి.

మహాత్ముడి బాటలో 'నేను.. నా మిర్యాలగూడ..'

మహాత్ముడి ఆశయాల సాధనలో భాగంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. దీని కోసం ప్రత్యేకంగా 'నేను.. నా మిర్యాలగూడ..' నినాదంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా ఆగస్టు 15 నుంచి నియోజకవర్గంలో లక్ష మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్వచ్ఛ మిర్యాలగూడగా తయారు చేయడమే లక్ష్యంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గాంధీ జయంతి రోజు నుంచి ప్లాస్టిక్ సంచులను పూర్తిగా నిషేధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ విద్య, వైద్యం బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

> "గాంధీ జయంతి రోజు నుంచి మిర్యాలగూడ పట్టణంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నాం. ఎవరైనా ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం" – ఎమ్మెల్యే బీఎల్ఆర్


మిర్యాలగూడలోని ప్లాస్టిక్ సంచుల దుకాణదారులకు ఆదేశాలు జారీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్ (పాత చిత్రం)

త్వరలో చెర్వుగట్టు ఘాట్‌రోడ్డు
పనులకు మోక్షం

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి గుహాలయానికి ఏటా భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయానికి ఆదాయం కూడా భారీగా సమకూరుతుంది. అధిక సంఖ్యలో భక్తులు వచ్చిన (అమావాస్య, బ్రహ్మోత్సవాలు, పండగల రోజులు, సెలవుల్లో) సమయంలో కేవలం ఘాట్ రోడ్డు చిన్నగా ఉండటంతో అటు ఇటు వైపు వెళ్లే వాహనదారులతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపైన 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. కథనాలకు స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం త్వరలోనే గుట్టను సందర్శిస్తామని తెలిపారు. ఇక్కడి ఘాట్ రోడ్డు సమస్యకు నివేదికను తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారని ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ఘాట్ రోడ్డు సమస్య తలెత్తకుండా ఉండటం కోసం.. ప్రస్తుతం ఉన్న ఘాట్ రోడ్డుకు 20 అడుగుల మేర విస్తరణతో పాటు చెర్వుగట్టులోని నంది విగ్రహం నుంచి భక్తుల వాహనాలు గుట్టపైకి వెళ్లేలా అధికారులు నివేదికను రూపొందిస్తున్నట్లు తెలిపారు.


ఘాట్ రోడ్డుపై ఇరువైపుల వాహనాల రద్దీ

వయోవృద్ధులు లేని సమాజం ఊహించలేనిది


వయోవృద్ధులను సన్మానిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: వయోవృద్ధులు లేని సమాజం ఉండదని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర తెలిపారు. వారు లేని సమాజం ఊహించలేనిదని చెప్పారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కుటుంబ పెద్దలను గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లాలో వయోవృద్ధులకు సంబంధించి 280 కేసులు నమోదయ్యాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మండలస్థాయిలో కమిటీల ఏర్పాటు, వారికి చికిత్స తదితర విషయాలపై జిల్లా యంత్రాంగం దృష్టిసారిస్తుందని తెలిపారు. అదనపు ఎస్పీ పి.రాములు నాయక్, జిల్లా సంక్షేమాధికారి సక్కుబాయి, డీఆర్‌డీవో అదనపు పీడీ శారద, వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

శిశువుల ఊపిరికి ఊతం..!


సూర్యాపేట నియోనేటల్ వాహనంలో శిశువుకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది (పాత చిత్రం)

☛ అత్యవసర పరిస్థితుల్లో 108 నియోనేటల్ వాహన సేవలు

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: నవజాత శిశువు సంరక్షణలో భాగంగా గత ఏడాది ఆగస్టు నుంచి ప్రభుత్వం '108' నియోనేటల్ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు ఒక్కో వాహనం చొప్పున మొత్తం మూడు వాహనాలను అందించింది. అత్యవసర వైద్యం అవసరమైన వేలాది మంది శిశువుల ప్రాణాలను రక్షించడంలో వాహనాల సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వేల మంది శిశువులకు సేవలందించింది.

వాహనంలోనే మినీ ఐసీయూ

అప్పుడే జన్మించిన శిశువు నుంచి 30 రోజుల(నెల)లోపు వయస్సు పిల్లలను నియోనేటల్‌గా పరిగణిస్తారు. ముఖ్యంగా అప్పుడే జన్మించిన శిశువులు ఎక్కువగా శ్వాస, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతుంటారు. సకాలంలో పెద్దాసుపత్రులకు తరలించాలంటే అంబులెన్సులోనే మినీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) వంటి వ్యవస్థ అవసరం. సరిగ్గా అదే విభాగాన్ని అధునాతన పరికరాలతో 108 నియోనేటల్ వాహనాన్ని రూపొందించారు. కృత్రిమ శ్వాస అందించే వెంటిలేటర్, ఆక్సిజన్, నాడీ, రక్తపోటును పరీక్షించే మానిటర్, బయటి నుంచి శ్వాస అందించే బ్యాగ్‌మాస్క్ డివైజ్, శిశువును వెచ్చగా ఉంచే బేబీ వార్మర్ లాంటి యంత్ర పరికరాలు అందుబాటులో ఉంటాయి. ఒక్కో వాహనంలో నిరంతరం అందుబాటులో ఉండేలా ఇద్దరు చొప్పున ఈఎంఆర్‌లు, మరో ఇద్దరు పైలెట్లను నియమించారు.

నల్గొండ, భువనగిరి జిల్లా నియోనేటల్ కేసుల వివరాలు

నెల	నమోదైన కేసుల సంఖ్య	
	నల్గొండ	భువనగిరి
ఏప్రిల్	41	63
మే	35	61
జూన్	42	70
జులై	43	52
ఆగస్టు	44	50
సెప్టెంబరు	46	63

శిశు మరణాల రేటు తగ్గుతోంది


– నజీరొద్దీన్, ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ

ఈ వాహనాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాలో శిశు మరణాల రేటును తగ్గించగలిగాం. అనారోగ్యంతో జన్మించిన శిశువులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు శిక్షణ పొందిన సిబ్బంది పర్యవేక్షణలో పెద్దాసుపత్రులకు తరలిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రాసుపత్రులకు, అవసరమైతే జిల్లా కేంద్రాసుపత్రుల నుంచి హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలిస్తున్నాం. వాహనంలో అందుబాటులో ఉన్న వెంటిలేటర్ సాయంతో కృత్రిమ శ్వాస, నియోనేటల్ వార్మర్ సాయంతో తల్లి గర్భంలో ఉన్న ఉష్ణోగ్రతను అందిస్తూ ప్రాణాలు రక్షిస్తున్నాం. ఈ సదుపాయంతో పేద తల్లిదండ్రులపై రూ.వేలల్లో ఆర్థిక భారంతోపాటు మానసిక ఆందోళన తప్పుతోంది.

రహదారి దత్తత.. ప్రమాదాలకు చెక్


నల్గొండ సమీపంలోని 12వ పటాలం వద్ద రోడ్డును పరిశీలిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ తీవ్రస్థాయిల్లో కసరత్తు చేస్తోంది. ప్రమాదాలను తగ్గించేందుకు ఇప్పటికే గుర్తించిన ప్రమాద గంతికలను పోలీస్ అధికారులు దత్తత తీసుకున్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ నల్గొండ మండలం, అదనపు ఎస్పీ రాములు నాయక్ వేములపల్లి మండలం, నల్గొండ డీఎస్పీ కేతేపల్లి మండలం, మిర్యాలగూడ డీఎస్పీ మిర్యాలగూడ మండలం, దేవరకొండ డీఎస్పీ చింతపల్లి మండలాలను దత్తత తీసుకున్నారు. ఆయా మండలాల్లోని ప్రమాద గంతికలను సందర్శించి సమన్వయ శాఖల అధికారులతో మాట్లాడుతూ ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోనున్నారు. అందులో భాగంగా మంగళవారం ఎస్పీ శరత్ చంద్ర పవార్ నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి చర్లపల్లి, 12వ పటాలం ప్రాంతాలను సందర్శించారు. వేగ నియంత్రణ సూచికలు, బొల్లార్డు రేడియం స్టిక్కర్లు, సర్వీస్‌రోడ్ల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, రూరల్ ఎస్సై సైదాబాబా, నార్కట్‌పల్లి ఎస్సై క్రాంతి, విశ్రాంత సీఐ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం కాని డీఎస్సీ ధ్రువీకరణ పత్రాల పరిశీలన

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో ఒకటి నిష్పత్తి మూడు చొప్పున ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం నుంచి ప్రారంభం కావాల్సిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రారంభం కాలేదు. రాష్ట్ర విద్యాశాఖ నుంచి 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల జాబితా మంగళవారం రాత్రి 8 గంటల వరకు రాలేదు. డీఎస్సీ 2024 ఫలితాలు విడుదల చేసిన ప్రభుత్వం ఈ నెల 1 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపడుతున్నట్లు ప్రకటించారు. కానీ.. మంగళవారం రాత్రి వరకు ఉన్నతాధికారుల నుంచి విద్యాశాఖకు జాబితాలు రాలేదు.

పశువైద్యశాల మూత



చందుపట్లలో మూతపడిన గ్రామీణ పశువైద్యశాల

నకిరేకల్, న్యూస్‌టుడే: మూగ జీవాలకు వైద్యం అందక పెంపకందారులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నకిరేకల్ మండలం చందుపట్లలోని గ్రామీణ పశువైద్యశాల సిబ్బందిలేక రెండు నెలలుగా తెరుచుకోవడం లేదు. ఇక్కడ ఎల్ఎస్ఏ పోస్టు నాలుగేళ్ల నుంచి ఖాళీగా ఉంది. రెండు నెలల క్రితం ఇక్కడ పని చేసే అటెండరు బదిలీపై తిప్పర్తి మండలానికి వెళ్లారు. ఇక్కడ ఎల్ఎస్ఏను, అటెండరును బదిలీల్లో భాగంగా నియమించకపోవడంతో వైద్యశాఖ మూతపడింది. దీని పరిధిలో చందుపట్ల, పాదూరివారిగూడెం, కొత్తవారిగూడెం, కందిమళ్లవారిగూడెం, మండలాపురం, మర్రూరు గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లోని పశువులు, గొర్రెలు, మేకలు, పెంపుడు జంతువులు రోగాల బారిన పడుతుండటంతో నకిరేకల్, మంగళపల్లిలోని పశు వైద్యశాలకు వ్యయప్రయాసలతో వెళ్లాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చందుపట్ల సమస్య జిల్లా అధికారులకు వివరించామని మండల సీనియర్ పశు వైద్యాధికారి డా.రాంరెడ్డి తెలిపారు.

మరోసారి పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు సోమవారం మరోసారి ధర్నాకు దిగారు. గుత్తేదారు రెండు నెలల వేతనాలతో పాటు ఆరు నెలల ఈపీఎఫ్, ఈఎస్సై చెల్లించడం లేదని వారం రోజుల క్రితం చేసిన ధర్నాలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సూచన మేరకు ఆందోళన విరమించారు. నాలుగు రోజుల్లో ఈపీఎఫ్, ఈఎస్సై, వేతనాలు చెల్లిస్తామని చెప్పినా గుత్తేదారు నేటికి స్పందించక పోవడంతో ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని సంఘం నాయకులు తెలిపారు.

బతుకమ్మ పండగొచ్చె ఉయ్యాలో..

పాఠశాలలకు దసరా సెలవులు ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి ఈనెల 14వ తేది వరకు సెలవులు ప్రకటించారు. దీంతో ఒక రోజు ముందు పలు పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలతో మార్మోగాయి. బతుకమ్మ ఆట, పాటలతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు సందడి చేశారు. సప్తవర్ణ శోభితంగా విద్యార్థినులు రంగు రంగుల సాంప్రదాయ దుస్తులతో బతుకమ్మలు ఆడారు. ఇక గురుకులాల విద్యార్థులు సెలవులు రావడంతో ఇంటి బాట పట్టారు. తమ తల్లిదండ్రులు గురుకుల పాఠశాలలకు వచ్చి పిల్లలను తీసుకెళ్లారు.
– నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే:


నల్గొండ కతాల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ ఉత్సవంలో పాల్గొన్న ఎంఈవో అరుంధతి, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు


నకిరేకల్: పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో బతుకమ్మలను తయారు చేస్తున్న చిన్నారులు

నిల్వకు నీడలేదు.. తూకానికి చోటులేదు

★ సాగు విస్తీర్ణం పెరగడంతో అద్దెకు దొరకని భూములు


కనగల్: ఏమిరెడ్డిగూడెంలో గతంలో ఐకేపీ కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసిన స్థలంలో పంటల సాగుకు ఏర్పాట్లు

ఈనాడు, నల్గొండ – న్యూస్‌టుడే, కనగల్

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లకు స్థలాల కొరత ప్రతిబంధకంగా మారింది. ఈ సీజన్‌లో భారీ వర్షాలకు తోడు, రెండు రాష్ట్రాల వరప్రదాయిని నాగార్జున సాగర్ నిండుకుండగా మారడంతో గతేడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. భారీ దిగుబడులతో పాటు సన్నాలు ఎక్కువగా అమ్మకానికి వస్తాయనే నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే అధికారులు 1005 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించారు. ఇందులో సుమారు 35 శాతం కేంద్రాలకు స్థలాల కొరత ఉందని ప్రాథమికంగా తెలిసింది.

జిల్లా	కొనుగోలు కేంద్రాలు
నల్గొండ	375
సూర్యాపేట	340
యాదాద్రి	290

ప్రత్యామ్నాయంపై దృష్టి

సాధారణంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సీజన్ల వారీగా ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకుంటే ప్రైవేటు వ్యక్తుల భూములను అద్దెకు తీసుకుంటారు. భూగర్భజలాలు పెరగడంతో ఇన్నాళ్లు పడావు ఉన్న భూములూ సాగులోకి వచ్చాయి. గ్రామాల్లో రెండు నుంచి మూడెకరాల వరకు భూమి ఉంటే అందులో ఒక సీజన్‌లో కొనుగోలు కేంద్రం నిర్వహిస్తే నెలకు సదరు యజమానికి రూ.10 వేల వరకు చెల్లించేవారు. ఇప్పుడు రూ.15 వేల వరకు ఇస్తామన్నా పల్లెల్లో భూమి దొరకని పరిస్థితి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ధాన్యం కోతలు ప్రారంభమయ్యాయి. మరో పక్షం రోజుల్లో పూర్తిస్థాయిలో కోతలు ప్రారంభమై కొనుగోలు కేంద్రాలకు సరకు పోటెత్తనుంది. స్థలాల కొరత ఉన్న చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

అంచనాలు ఇలా..

ప్రస్తుత సీజన్‌లో 10.53 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యింది. ఈ సీజన్ నుంచే ప్రభుత్వం సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 5.5 లక్షల ఎకరాల్లో సన్నరకాలు సాగవుతున్నాయి. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు భారీగానే వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సన్న, దొడ్డు రకాలు కలిపి 15.6 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు రానున్నట్లు అధికారులు భావిస్తున్నారు. కరోనా సమయంలో ఉమ్మడి జిల్లాలో సుమారు 13 లక్షల ఎంటీల వరకు కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో అది దాటే అవకాశం ఉన్నట్లు తెలిసింది. 'కొనుగోళ్లకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా వ్యవహరిస్తున్నామని, స్థలాలు లేని చోట్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామ'ని సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు.

★ ఈ సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం : 10.56 లక్షల ఎకరాలు
★ దిగుబడి అంచనా : 28 లక్షల ఎంటీలు
★ కొనుగోలు కేంద్రాలకు రానున్న దొడ్డు, సన్నరకాలు: 15.5 లక్షల ఎంటీలు

ఇంతినిండుగా.. పూల పండగ



బతుకమ్మ ఆడుతున్న మహిళలు (పాతచిత్రం)

ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి మనది. తీరొక్క పూలను తీసుకువచ్చి బతుకమ్మగా పేర్చి పూజలు చేసే సంప్రదాయం తెలంగాణ సొంతం. చిన్నారులు, యువతులు, మహిళలు, వృద్ధులు ఆడుతూ.. పాడుతూ.. కష్టాలు మరిచేలా చేసే అరుదైన వేడుక ఇది. మహిళలకు ఇష్టమైన పూల పండగ బతుకమ్మ రానే వచ్చింది. పల్లె.. పట్టణం అంతటా 'బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో'.. అంటూ సాగే పాటలు మారుమోగనున్నాయి. నేటి నుంచి ఎంగిలిపువ్వు బతుకమ్మతో సంబరాలు ప్రారంభం కానున్నాయి. - మోత్కూరు, సూర్యాపేట సాంస్కృతికం, నాంపల్లి, న్యూస్‌టుడే

- తెలంగాణ సంస్కృతికి పట్టుకొమ్మ బతుకమ్మ పర్వదినం
- నేటి నుంచి సంబరాలు షురూ

ఆశ్వయుజ మాసంలో రాష్ట్రంలో జరుపుకొనే పండగల్లో అత్యంత విశిష్టమైనది బతుకమ్మ. ఆడపడుచులు ఆత్మీయదేవతగా కొలిచే ఈ పూలరాసి పండగ ప్రకృతి ప్రాముఖ్యాన్ని చాటుతుంది. 'ఎన్ని కష్టాలు వచ్చినా.. ఆపదలు మీదపడినా.. ఆత్మస్థైర్యంతో ముందుకు కదలాలి. కలకాలం నిండు నూరేళ్లు బతుకును పండగలా తీర్చిదిద్దుకోవాలంటూ బతుకమ్మ సందేశాన్నిస్తుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈ నెల 2 నుంచి బతుకమ్మ సంబురాలు మొదలై.. తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. ఏటా సూర్యాపేట, నల్గొండ, భువనగిరి, నకిరేకల్, హుజూర్‌నగర్ పట్టణాల్లో బతుకమ్మ పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు.



పూలను పేర్చడం ఓ కళ

బతుకమ్మ పండగలో ప్రత్యేకం ఆటపాటలు, అలంకరణ. బతుకమ్మ పేర్చేటప్పుడు రెండు, ఐదు, ఏడు రకాల పూలను వాడుతారు. తూర్పు, ఉత్తరం వైపుగాని కూర్చొని పేర్చుతారు. తాంబాలంలో గుమ్మడి ఆకులు పరిచి దానిపై పసుపు, కుంకుమలతో బండారు వేస్తారు. చుట్టూ ముత్తైదువులకు బొట్టు ఇచ్చి పేర్వడం ప్రారంభిస్తారు. పక్కనే నిండు నీళ్ల చెంబును ఉంచుతారు. తప్పనిసరిగా తంగేడు పూలు మొదటివరసలో పేర్చుతారు. తరువాత గునుగు వరస, మిగతావి వరసల్లో బంతి, సీతమ్మజడ, పోకబంతి, బీరపువ్వు, తదితరాలను అలంకరిస్తారు.

ఏడురకాల పూలతో బతుకమ్మను, మరో చిన్న బతుకమ్మను తోడుగా పేర్చుతారు. పసుపుతో గౌరమ్మను చేసి చిక్కుడాకుల్లోగానీ, తమలపాకుల్లోగానీ పెడతారు. పత్తితో వస్త్రం చేసి అలంకరిస్తారు. ఇంటి అనవాయితీ అనుసరించి ఒకతల, రెండుతలల గౌరమ్మను తయారు చేస్తారు. మంగళహారతులు సమర్పిస్తారు.

రోజుకో బతుకమ్మ.. నైవేద్యాలు

మొదటి రోజు ఎంగిలిపువ్వు బతుకమ్మ: వక్కలు, తులసీ ఆకులు, సత్తుపిండి నైవేద్యం
అటుకుల బతుకమ్మ: పప్పు, బెల్లం, ప్రసాదం
ముద్దపప్పు బతుకమ్మ: బెల్లం వేసి ఉడికించిన సెనగ పప్పు
నానబియ్య బతుకమ్మ: పాలలో నానబెట్టిన బియ్యం పిండిలో బెల్లం
అట్ల బతుకమ్మ: అట్లు/దోశ నైవేద్యం
అలిగిన బతుకమ్మ: కొన్నిచోట్ల బతుకమ్మను పేర్చరు, ఆడరు.
వేపకాయల బతుకమ్మ: పప్పు, బెల్లం
వెన్నముద్దల బతుకమ్మ: నువ్వులు, బెల్లం కలిపిన ముద్ద
తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ: పెరుగన్నం, చిత్రాన్నం, కొబ్బరిపొడి, నువ్వులపొడి ఇలా... ఐదురకాల సద్దులతో నైవేద్యం సమర్పిస్తారు



చౌటుప్పల్‌లో బతుకమ్మ ఆడుకోవడానికి వెళ్తున్న మహిళలు

'పల్లె'వించిన పాట

తెలంగాణ గ్రామీణ జీవనంతో ముడిపడి ఉన్న ప్రతి అంశాన్ని బతుకమ్మ పాటలో వినవచ్చు. ప్రతి చరణం చివర ఎక్కువగా 'ఉయ్యాలో', 'కోల్', 'చందమామా', 'వలలో' వంటి పదాలు వినిపిస్తాయి. జన జీవనం, మహిళల కోర్కెలు, భావనలూ, ఆలోచనలనూ అంతర్లీనంగా వినిపిస్తాయి. వర్షాకాలంలో పంటలు పండుతున్న కాలంలో బతుకమ్మ వస్తుంది. అందుకే ప్రకృతిలక్ష్మీ స్వరూపంగా పూజిస్తారు. సద్దుల రోజు బతుకమ్మను సమీపంలోని చెరువులు, కుంటలు, నదుల్లో, ఆలయ ప్రాంగణాల్లో కోనేర్లు, బావుల్లో వదిలిపెడుతూ పోయిరావమ్మ బతుకమ్మ.. పోయి రావమ్మా... మళ్లొచ్చే ఏడాది మళ్లీరావమ్మా. .అంటూ పాటలు పాడుతూ సాగనంపుతారు.

ఇది మన సంస్కృతి..

– మర్రి జయశ్రీ, కవయిత్రి, మోత్కూరు



తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేదే బతుకమ్మ పండగ. ప్రకృతిని ఆరాధించే ఈ పూల పండుగ మహిళలకు ఎంతో ఇష్టమైనది. నా చిన్నతనం నుంచి ఇప్పటి వరకు ఈ పండుగ ప్రాశస్త్యం ఏమాత్రం తగ్గడం లేదు. ఇంకా పెరుగుతోంది. బతుకమ్మ పేర్చడంలో, పాటలు పాడటంలో అదే సంప్రదాయం కొనసాగుతోంది.

బతుకమ్మ సారం ఇదే ఉయ్యాలో..

మహిళలను గౌరవిద్దాం..: పితృదేవతలను స్మరించుకునే రోజు మొదలయ్యే బతుకమ్మ మహిళలను గౌరవించటం నేర్పే పండగ. ఇంటిల్లిపాదీ చల్లగా ఉండాలని గౌరమ్మను వేడుకునే పర్వదినం. మహిళలను గౌరవించటం, ఆదరించటం, ప్రేమానురాగాలతో వారిని చేరదీయడం, అమ్మతనంపై భక్తి లాంటి సందేశాలు ఈ వేడుకలో ఇమిడి ఉన్నాయి. మానవజాతి మనుగడ స్త్రీని గౌరవించటంలో ఉందని చాటుతుంది.

'మొక్క'వోని దీక్ష: పువ్వు అంటే రేపటి ఫలం. నేటి మొక్కే రేపటి జీవనాధారం. చెట్ల ప్రాధాన్యం, పువ్వు గొప్పతనాన్ని, జలం, భూమితో మానవునికి ఉన్న సంబంధాలు, కుటుంబ బంధాలను తెలిపే బతుకమ్మ పాటలు అనేకం వీటిని బతికించుకునేందుకు పుట్టినవే.

వివక్షకు తావులేకుండా..: కుల, మత, ధనిక, పేద బేధం లేని పండగ ఇది. వివక్షలకు తావులేని సమాజం కోరుకునే ఇందులో దాగిన అంతర్యం.

జలవనరుల శుద్ధి..: వివిధ రకాల పూలు, ఆకులతో బతుకమ్మలను పేర్చి తిరిగి వాటిని చెరువులు, నదులు, పంటకాల్వల్లో వదులుతారు. అనేక ఔషధ గుణాలున్న పూలు నీటిని శుభ్రపర్చి జలచరాలను కాపాడతాయి. ఇది శాస్త్రీయంగా నిరూపణ జరిగింది. - హుజూర్‌నగర్, న్యూస్‌టుడే



హుజూర్‌నగర్‌లో బతుకమ్మ ఆట, పాట(పాత చిత్రం)

గడువు ముగిసె..!

★ ఉమ్మడి జిల్లాలో రావాల్సిన సీఎంఆర్ 4.53 లక్షల మెట్రిక్ టన్నులు


హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: రావాల్సిన సీఎంఆర్ బియ్యం రాలేదు.. మిల్లర్లకు ఇచ్చిన గడువు మాత్రం గత నెల 30తో ముగిసింది. బకాయి సీఎంఆర్ వసూలుకు మళ్లీ గడువిస్తే తప్ప వసూలయ్యే అవకాశం లేదు. ఇందుకు అధికారులు, మిల్లర్లు ఎదురు చూస్తున్నారు. 2023-24 వానాకాలం, యాసంగి సీజన్‌ల సీఎంఆర్ బకాయిలను వసూలు చేసేందుకు జులై మొదటి వారం నుంచి 90 రోజులు గడువు ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో వానాకాలం, యాసంగివి కలిపి గత నెల 21 నాటికి 4,53,399 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. ప్రస్తుతం ఆ గడువు ముగిసింది. మరో వారం రోజుల్లో కొత్త ధాన్యం వస్తున్న క్రమంలో ఇంకా సీఎంఆర్ బకాయిలు ఉండటం అధికారులకు సమస్యగా తయారైంది. పాత బకాయి ఉన్నవారికి కొత్త ధాన్యం కేటాయింపులు చేయకూడదు. వానాకాలం సీజన్‌లో భారీగా ధాన్యం వస్తున్న క్రమంలో బకాయిదారులు అంటూ పక్కన పెడితే కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు తలనొప్పిగా మారుతుంది. మరోసారి గడువు పెంచడం తప్ప వేరే మార్గం లేదని అధికారులు చెబుతున్నారు.

2023-24 వానాకాలం, యాసంగి సీఎంఆర్ వసూలు వివరాలు (సెప్టెంబరు 21 నాటికి మెట్రిక్ టన్నుల్లో..)

జిల్లా	వసూలైన బియ్యం	బకాయిలు
వానాకాలం:		
నల్గొండ	1,89,215	28,361
సూర్యాపేట	75,590	64,564
యాదాద్రి	1,38,848	40,039
యాసంగి:		
నల్గొండ	1,39,613	82,113
సూర్యాపేట	40,604	1,22,989
యాదాద్రి	68,721	1,15,333

యాదాద్రి స్వర్ణతాపడం ఆకృతి ఖరారు..!

ఈనాడు, నల్గొండ : స్వయంభు క్షేత్రమైన శ్రీ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురాన్ని స్వర్ణమయం చేయడానికి అనువుగా అధికారులు వేగంగా కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా కీలకమైన స్వర్ణమయ ఆకృతిని తాజాగా ఖరారు చేసినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. యాదాద్రి స్వర్ణతాపడ పనులపై ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రి కొండా సురేఖ సమీక్ష నిర్వహించారు. ఆకృతి ఖరారుతో త్వరలోనే పనులు మొదలు కానున్నాయి. తొలుత స్వర్ణతాపడాన్ని 127 కిలోల బంగారంతో చేయాలని నిర్ణయించినా వివిధ కారణాలతో దాన్ని 65 కిలోలకు తగ్గించారు. ఇందుకు దేవస్థానం వివిధ వర్గాల నుంచి విరాళాలు సేకరిస్తోంది. ఇప్పటి వరకు 11 కిలోల బంగారంతో పాటు రూ.20 కోట్ల నగదు సమకూరినట్లు సమాచారం. ప్రస్తుతం బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో విరాళాల ద్వారా వచ్చిన నగదుతో బంగారం కొనుగోలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. బంగారు తాపడంపై ఒక ట్రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడవుతాయని దేవస్థాన కీలక అధికారి ఒకరు 'ఈనాడు'కు వెల్లడించారు.



నయనానందకరం.. అమ్మరూపం

◆ 3 నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: సకల శుభాలకు మూలం విజయదశమి. ఆ రోజు ఏ కార్యం తలపెట్టినా మంచి ఫలితాలు ఇస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. హిందువుల పెద్ద పండగల్లో విజయదశమి ముఖ్యమైంది. ఈ నెల 3వ తేదీ నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దుర్గామాత రోజుకో అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లోని కాలనీలలో, ఊరూరా కమిటీ సభ్యులు మండపాలను సిద్ధం చేసి తొమ్మిది రోజులు నిష్ఠతో దుర్గాదేవి అమ్మవారిని పూజించేందుకు ఏర్పాటుచేస్తున్నారు.

3న **ఆదిలక్ష్మి:** ఈ నెల 3న అమ్మవారు ఆదిలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. భగవంతుడిని గుర్తించడానికి ప్రధాన లక్షణమైన అమ్మకు లక్ష్మీ అని పేరు. భగవద్ తత్వాన్ని లక్ష్మీ అమ్మతోనే గుర్తించడంతో ఆ పేరు వచ్చిందని పండితులు చెబుతున్నారు.

4న **సంతానలక్ష్మి:** సకల చరాచర జగత్తు అంతా అమ్మవారి సంతానమే. అందుకే అమ్మవారు సంతాన లక్ష్మి అని ప్రతీతి. సంతాన లక్ష్మి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శిస్తే ఆటంకాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

5న **గజలక్ష్మి:** గజలక్ష్మి అవతారంలో ఉన్న అమ్మవారిని ఆరాధించి దేవేంద్రుడు త్రైలోక్యాధిపతి అయినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ అవతారంలో ఉన్న అమ్మవారిని ఆరాధిస్తే మహా సంపద కలుగుతుందని విశ్వసిస్తారు.



6న **ధనలక్ష్మి:** ఈ సృష్టిలో ధనం అంటే విద్యా, హిరణ్య, శక్తి, ఈ మూడు విధాలైన ధనాన్ని ప్రసాదించే అమ్మను ధనలక్ష్మి మాతగా కొలుస్తుంటాం.

7న **ధాన్యలక్ష్మి:** ఈ రోజు అమ్మవారిని ధ్యానలక్ష్మిగా పూజలందుకోనుంది. ధనధాన్యం సిద్ధించాలని అమ్మవారిని కొలుస్తుంటారు. భూమి మీద ధనధాన్యాన్ని ప్రసాదించే అమ్మవారే. అమ్మవారిని ఆరాధిస్తే సకల బాధలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

8న **విజయలక్ష్మి:** అమ్మవారు విజయలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారిని జ్ఞానేశ్వరి విజయప్రధాయని అని కీర్తిస్తుంటారు. మనం ఏ పని తలపెట్టిన విజయం సాధించాలని అమ్మవారిని కొలిస్తే తప్పక చేకూరుతుందని విశ్వసిస్తారు.

9న **ఐశ్వర్యలక్ష్మి:** ఐశ్వర్య రూపంలో దర్శనం ఇచ్చే అమ్మవారిని కొలిస్తే సకల సంపదలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. ఐశ్వర్యం అంటే శాసనపరమైన శక్తి సామర్థ్యాలు అని అర్థం. అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు శాసకురాలు అమ్మవారు.

10న **వీరలక్ష్మి:** అమ్మవారు వీరలక్ష్మిగా ఆవిర్భవించి మహిషాసురుడిని సంహరించింది. ఉపద్రవాలను పారదోలి సకల శుభాలను కలుగుజేస్తుందని భక్తుల నమ్మకం.

11న **మహాలక్ష్మి:** అష్టలక్ష్మీ రూపాలను ధరించిన అమ్మ కరుణా స్వరూపమైన నిజరూపంలో భక్తులను అనుగ్రహిస్తుంది. మనిషికి అవసరమైన ధనం, ధాన్యం, సంతానం, విద్య, ఇలా అన్ని అవసరమైన అష్టైశ్వర్యాలను మహాలక్ష్మి అమ్మవారు ప్రసాదిస్తారు.

పెద్దలు.. దీవెనలందించే పెత్తరమాస

చిట్యాల, న్యూస్‌టుడే: పితృదేవతలను తలచుకొని వారిపేరిట తర్పణాలు విడిచే కాలాన్ని 'మహాలయ పక్షం', 'పితృపక్షం' అని పిలుస్తుంటారు. భాద్రపద బహుళ పాడ్యమి నుంచి అమావాస్య మధ్యనున్న (సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు) 15 రోజుల కాలాన్ని 'మహాలయ పక్షం'గా పరిగణిస్తారు. మనిషి ఎంత ఎదిగినా, తన జన్మకి, సంస్కారం, సంస్కృతికి కారణమైన మన పెద్దలే వాటికి మూలాలని మరిచిపోకుండా తండ్రి, తాత, ముత్తాతలను తలచుకొని పుత్రులు నిర్వహించే ఓ కార్యక్రమం ఇది. శ్రాద్ధ, తర్పణ, పిండ ప్రదానంతో కూడిన పితృ యజ్ఞ విధులను, ఏటా ఒకరోజు వారిని తలచుకునేందుకు హిందూ పురాణాల్లో నిర్దేశించినదే మహాలయ పక్ష కాలం. 14 రోజుల్లో కుదరని పరిస్థితిలో చివరిరోజు అమావాస్యనాడు అందరి పేరిట విడవవొచ్చు. అందుకే ఆ రోజును 'సర్వపితృ అమావాస్య' అంటారు. దీన్ని కొన్ని ప్రాంతాల్లో పెత్తరమాస అని స్థానిక వాడుకభాషలో పలుకుతుంటారు.

ఎందుకు చేయాలంటే..

మహాలయ అమావాస్యరోజు పితృదేవతలు వారి సంతానం ఇంటి ద్వారం దగ్గరే నిలబడతారని నమ్మకం. వారికి శ్రాద్ధకర్మ నిర్వహించని పక్షంలో సంతానానికి దీవెనలకు బదులు శపించి వెళ్తారని చెబుతారు. మరణించిన వారు మోక్ష ప్రాప్తి కలగాలంటే వారి కర్మ పరిపక్వం కావాలి. అందుకు దేహధారణచేసి.. పితరులు ఈ లోకంలోకి రావాలంటే వారికి అన్నాన్ని అందించాలి. కొందరికి పుత్ర సంతానంలేక శ్రాద్ధ కర్మలు జరగకపోవచ్చు. అలాంటి వారిపేరిట కూడా తర్పణాలు వదలొచ్చు.

★ పితృపక్షంలో ఆ తిథినాడు శ్రాద్ధం పెట్టలేనివారు శ్రాద్ధం, దానం, తర్పణం చేస్తారు. దీని వల్ల సంతానం ప్రాప్తిస్తుందని పురాణాల్లో పేర్కొన్నారు. పితరులను సంతోష పెడితే సంతతికి ఆయువు, విద్య, ధనం, సంతానం కలిగేలా దీవిస్తారని చెప్తారు. శ్రాద్ధకర్మలో నువ్వులు, గూడమిశ్రిత అన్నం సమర్పిస్తే ఆ దానం అక్షయమవుతుంది.

తర్పణాలు వీడేది ఇలా..

పక్షం రోజుల్లో ఏదో రోజు ఒక అతిథిని ఇంటికి పిలిచి పితృదేవతలకు తర్పణాలు వీడాలి. లేదంటే గయవంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లి శ్రాద్ధకర్మలు నిర్వహించాలి. అలా కుదరని పక్షంలో వారిని స్మరిస్తూ బ్రాహ్మణుడికి స్వయం పాకాన్ని దానంగా ఇవ్వాలి. తండ్రి చనిపోయిన తిథిరోజు మహాలయం పెట్టడం ఉత్తమంగా సూచించారు. వీలుకాకుంటే మహాలయ అమావాస్యరోజున పెట్టాలి.

కూతురుని వివాహం చేసుకున్నాడని తోడల్లుడి హత్య

డిండి, న్యూస్‌టుడే: కూతురు వరుసయ్యే బాలికను తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడని పగ పెంచుకొని ఓ వ్యక్తిని అతని తోడల్లుడు, కుమారులు హత్య చేసిన ఘటన నల్గొండ జిల్లాలో సెప్టెంబరు 27న చోటు చేసుకుంది. డిండి మండలం చెర్కుపల్లిగేటు సమీపంలో ఇటీవల జరిగిన ఈ హత్య కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు తెలిపారు. డీఎస్పీ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా డిండి మండలం కామెపల్లి గ్రామానికి చెందిన రమాదేవికి కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి చెందిన శ్రీపతి జగదీష్‌కు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నేళ్ల పాటు హైదరాబాద్‌లో కలిసి జీవించారు. రెండేళ్ల నుంచి భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో రమాదేవి తల్లిదండ్రుల వద్దకు వచ్చి జీవిస్తుంది. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగినా జగదీష్ వైఖరిలో మార్పు రాలేదు. రమాదేవి మరో సోదరి నిర్మలకు నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం కొరటికల్ గ్రామానికి చెందిన కొంకి పెద్దయ్యతో వివాహం జరిగింది. కూతురు వరుస అయ్యే పెద్దయ్య కుమార్తె (బాలిక)తో జగదీష్‌కు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వీరిద్దరు ఆరు నెలల క్రితం వివాహం చేసుకున్నారు. బాలికను కిడ్నాప్ చేశాడని ఆమె తల్లిదండ్రులు అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జగదీష్ బాలికతో కలిసి ఉంటున్న ఫొటోలను వాట్సప్ గ్రూపుల్లో బంధువులకు పంపించడం మొదలు పెట్టాడు. పరువు పోతుందని భావించిన పెద్దయ్య... సెప్టెంబరు 27న కుమారులు మధు, అరవింద్‌లతో పాటు భార్య నిర్మల, మరదలు రమాదేవితో కలిసి కారులో వారు నివాసం ఉంటున్న అల్వాల్‌కి వెళ్లారు. నిద్రిస్తున్న జగదీష్‌ను కాళ్లు, చేతులు తాళ్లతో.. నోరు, కళ్లు చున్నీలతో కట్టి కారులో దేవరకొండ మీదుగా చెర్కుపల్లికి తీసువచ్చారు. సమీపంలోని గుట్టకు తీసుకెళ్లి జగదీష్‌ను రాళ్లతో పెద్దయ్య, మధు, అరవింద్‌లు హత్య చేశారు. నిర్మల, రమాదేవిలు బయట కాపలా ఉన్నారు. సెప్టెంబరు 28న రైతులు గుర్తు తెలియని శవం ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లి పోలీసులు దర్యాప్తు ప్రారంభించి పెద్దయ్యను విచారించగా.. కుమారులు అరవింద్, మధుతో కలిసి జగదీష్‌ను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. స్థానిక పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. 24 గంటల్లో కేసు ఛేదించినందుకు డిండి గ్రామీణ సీఐ సురేష్, ఎస్సైలు రాజు, సతీష్, సతీష్‌లతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు ప్రకటించినట్లు డీఎస్పీ తెలిపారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో ఈనెల 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం తెలిపాయి. అక్టోబర్ నెలను రొమ్ము కాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్‌నం.040- 23551235, 23550967లను సంప్రదించవచ్చని సూచించారు.

ఏటీఎంలో డబ్బుల చోరీ ముఠా అరెస్టు: డీఎస్పీ

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: బ్యాంకు ఏటీఎం యంత్రాల్లో సాంకేతిక సమస్యలను సృష్టించి డబ్బులు కాజేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలో ఇద్దరు దొంగలను మంగళవారం సూర్యాపేటలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పట్టణ ఠాణాలో మంగళవారం డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన గౌరవకుమార్, ఉదయ్‌భాను, విమల్ కలిసి సూర్యాపేటలోని పలు ఏటీఎంలే లక్ష్యంగా చోరీలకు పాల్పడాలని పథకం రచించారు. వారు ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ఇక్కడికి వచ్చారు. తమ ఏటీఎం కార్డులను ఉపయోగించి నగదు డ్రా చేసే క్రమంలో యంత్రం నుంచి డబ్బులు బయటకు వస్తుండగా 'లాన్' కేబుల్ తొలగిస్తారు. దాంతో వారి ఖాతా నుంచి డబ్బులు బయటకు వచ్చినప్పటికీ తిరిగి ఖాతాలోకి జమైనట్లు చూపుతాయి. ఈ తరహాలో గత నెల 27న సూర్యాపేటలోని పోచంపల్లి బ్యాంకు ఏటీఎం నుంచి రూ.10 వేలు చోరీ చేశారు. 28న డీబీఎస్ బ్యాంకు ఏటీఎంలో చోరీకి యత్నించి విఫలమయ్యారు. మంగళవారం మరోసారి పోచంపల్లి బ్యాంకు ఏటీఎంకు రావడంతో అరెస్టు చేసి డెబిట్ కార్డులతోపాటు రూ.10 వేలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. నిందితుల్లో విమల్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కేసు ఛేదనకు కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సై కుశలవ, సిబ్బంది కరుణాకర్, కృష్ణ, సైదులు, శివ, మధును అభినందించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110–00
రిటైల్	132–00
డ్రెస్డ్	191–00
స్కిన్‌లెస్	218–00

తల్లి దూరమై.. కసాయి నాన్న జైలుపాలై

- అమ్మను తలచుకొని రోదిస్తున్న చిన్నారులు

లాలించేందుకు అమ్మలేదు.. బుజ్జగించేందుకు నాన్న లేడు. అభం శుభం తెలియని ఆ చిన్నారులకు తమ తల్లిని మట్టిలో పూడ్చిన విషయమే పదే.. పదే గుర్తుకొచ్చి రాత్రిళ్లు నిద్రలోంచి ఉలిక్కిపడి లేచి రోదిస్తున్న వారి దైన్యస్థితి స్థానికులను కంట తడిపెట్టిస్తోంది. నాన్న క్షణికావేశం ఆ ముగ్గురు చిన్నారులకు తల్లిని శాశ్వతంగా దూరం చేయగా.. తండ్రి జైలుపాలయ్యాడు. నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం కడపర్తిలో అమ్మమ్మ, తాతయ్య వద్ద ఆశ్రయం పొందిన చిన్నారుల పరిస్థితి ఇది. కడపర్తికి చెందిన దాసరి వీరయ్య-రాములమ్మ దంపతుల కుమార్తె సరిత, సూర్యాపేట జిల్లా చిలుకూరుకు చెందిన దాసోజు బ్రహ్మచారి పదేళ్ల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి తొమ్మిదేళ్ల లోపు కుమార్తెలు మనోజ్ఞ, మోక్షజ్ఞ, కుమారుడు విశ్వ ఉన్నారు. విద్యుత్తు కార్మికుడిగా పనిచేస్తున్న బ్రహ్మచారి మద్యానికి బానిసై పనిచేయకుండా, కుటుంబాన్నీ పట్టించుకోవడం మానేశాడు. డిగ్రీ చదివిన భార్య సరిత సూర్యాపేటలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న క్రమంలో ఈ ఏడాది ఆగస్టు 14న రాత్రి భార్యతో గొడవపడ్డాడు. ఆమె మెడకు వైరుచుట్టి హత్యచేసి జైలుకెళ్లాడు. వీరి ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. వృద్ధులైన అమ్మమ్మ, తాతయ్యలు ఈ చిన్నారులను చేరదీసి కడపర్తికి తీసుకొచ్చారు. ప్రస్తుతం కడపర్తి ప్రభుత్వ పాఠశాలలో మనోజ్ఞ 5వ తరగతి, మోక్షజ్ఞ 3వ తరగతి, విశ్వ నర్సరీ చదువుతున్నారు. కాసేపు ఆడుతూ.. పాడుతూ ఉండే చిన్నారులు.. అంతలోనే తల్లి గుర్తుకు వచ్చి మౌనంగా కూర్చుంటున్నారని తాతయ్య ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో రేకుల ఇల్లు మినహా ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, జీవిత చరమాంకంలో ముగ్గురు చిన్నారుల భారం తమపై పడిందని, దారి చూపాలని వేడుకొంటున్నారు. - నకిరేకల్, న్యూస్‌టుడే



అమ్మ చిత్రపటంతో అమ్మమ్మ, తాతయ్య చెంత ముగ్గురు చిన్నారులు

నల్గొండ

• నల్గొండ • మునుగోడు • నకిరేకల్

సాగు మెలకువలతో మేలైన దిగుబడి : డీఏవో


పత్తి రైతుకు సూచనలిస్తున్న డీఏవో శ్రవణ్‌కుమార్

నాంపల్లి: పంటల సాగులో రైతులు మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. సర్వే నంబర్ల వారిగా పంటల నమోదు పరిశీలనలో భాగంగా మంగళవారం పగిడిపల్లి ఆవాస గ్రామంలో పత్తి, వరి పంటలను పరిశీలించి, తెగుళ్ల నివారణ, తదితర అంశాలపై రైతులకు పలు సూచనలు చేశారు. రేషన్ కార్డు లేని కారణంగా రుణమాఫీ కాని రైతులు కుటుంబ నిర్ధారణ కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఏవో మల్లేశ్, ఏఈవో నవీన్ ఉన్నారు.



దసరా సెలవులు ప్రకటించడంతో నల్గొండ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ -ఈనాడు, నల్గొండ:

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 52710, 80085 66199 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:
? పట్టణంలోని ఆర్పీరోడ్డు, రూరల్‌పోలీస్‌స్టేషన్ నుంచి మునుగోడు వెళ్లే మార్గంలో వర్షాలకు రోడ్లపై ఇసుక మేటలు వేశాయి. వాహనదారులు ప్రమదాల బారిన పడుతున్నారు. శుభ్రం చేయించాలి.
– వెంకటేశ్వర్లు, నల్గొండ.
✔ పరిశీలించి వెంటనే శుభ్రం చేయిస్తాం. – శ్రీనివాస్, నాగరాజు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, నల్గొండ పురపాలిక.

పాటల పరిమళం..
బతుకమ్మ సంబరం
నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం


నల్గొండలో బతుకమ్మలను పేరుస్తున్న మహిళలు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. ఆడపడుచులందరూ సంబరంగా నిర్వహించే వేడుక. ప్రకృతిని ఆరాధిస్తూ.. అనుబంధాలను గుర్తు చేస్తూ సాగే పూల ఉత్సవం. బతుకమ్మ వేడుకల సందర్భంగా మహిళలు తొమ్మిది రోజుల పాటు పూలదేవతను కీర్తిస్తూ ఆటపాటలతో సందడి చేస్తారు. పల్లెల్లో, పట్టణాల్లో వాడవాడల్లో చిన్నా, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఈ ఉత్సవాన్ని వైభవంగా జరుపుకొంటారు. నేటి నుంచి బతుకమ్మ ఉత్సవాల ప్రారంభం నేపథ్యంలో నల్గొండ పట్టణంలోని పలువురు మహిళలను 'న్యూస్‌టుడే' పలకరించింది

పాటలకు ప్రత్యేకత



భాగ్య, నల్గొండ

ప్రతి ఏటా మా కాలనీలో బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా జరుపుకొంటాం. ఈ ఉత్సవంలో పాడే ప్రతి బతుకమ్మ పాటలకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. ఏటా ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నాను. నేటి తరానికి తగ్గట్టు పాటలు ఉండటంతో మహిళలు, పిల్లలు సరదాగా ఉత్సవాల్లో ఆడిపాడుతున్నారు. కానీ.. నాటి పాటలే అప్పటి జీవన పరిస్థితులను ప్రతిబించేలా ఉండేవి. తెలంగాణ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేసిన మహా గొప్ప బతుకమ్మ ఉత్సవం. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ వేడుకల్లో మహిళలు భాగస్వాములు కావాలి.

అలంకరణలో ప్రత్యేకం:

విజయలక్ష్మి, నల్గొండ



పూలపండుగ వచ్చిందంటే మాకు ఎంతో ఉత్సాహంగా అనిపిస్తుంది. ఏటా మా ఇంట్లో వైవిధ్యంగా బతుకమ్మను పేరుస్తాం. కాలనీలోని మహిళల స్థానికంగా బతుకమ్మలను పేర్చి ఆడిపాడుతాం. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ ఉత్సవంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా పాల్గొంటారు. నేటి తరం అమ్మాయిలకు సైతం బతుకమ్మ ప్రాముఖ్యతను వివరిస్తాం. వారిని తమతో పాటు ఈ ఉత్సవంలో పాల్గొనేలా ప్రోత్సహిస్తాం. బతుకమ్మ పండుగ మహిళలకు ఎంతో ఇష్టమైన ఉత్సవం.

సంప్రదాయానికి ప్రతిబింబం..

రజిత



తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించేది బతుకమ్మ పండుగ. పూలతో చేసిన బతుకమ్మలతో ప్రకృతికి పట్టాభిషేకం చేస్తుంటాం. తీరొక్క పూలతో పేర్చే పులశిఖరంపై గౌరమ్మగా పసుపు ముద్దను ఉంచి కొలుస్తుంటాం. అమ్మవారిని కొలుస్తూ ఆడిపాడుతాం. మన భారతీయ పండుగల ఆచార సంప్రదాయాల్లో ఆధ్యాత్మికతతో పాటు శాస్త్రీయత ఉంటుంది. బతుకమ్మ పండుగకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉంది. బతుకమ్మ ఉత్సవాలను ఏటా మేము పనిచేసే ప్రేరణ విద్యా సంస్థలో మహిళా ఉపాధ్యాయులమంతా ఘనంగా జరుపుకుంటాం.

డీఎస్సీలో పొనుగోడు వాసి ప్రతిభ



కట్ట వెంకటేశం

కనగల్, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో కనగల్ మండలం పొనుగోడు గ్రామానికి చెందిన కట్ట వెంకటేశం స్కూల్ అసిస్టెంట్(తెలుగు)లో 70.83 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు. భాషా పండిట్ (తెలుగు)లో 72.33 మార్కులతో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. గత రెండు నెలల క్రితం గురుకుల పాఠశాల టీజీటీగా ఉద్యోగం సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన వెంకటేశం ప్రస్తుతం ఉద్యోగం చేయడంతో పాటు ఒకే సారి రెండు ఉద్యోగాలకు అర్హత సాధించడం పట్ల కుటుంబసభ్యులు, మిత్రులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.


జెల్ల ప్రశాంతి


నకిరేకల్: డీఎస్సీ ఫలితాల్లో నకిరేకల్‌కు చెందిన జెల్ల ప్రశాంతి ప్రతిభ చూపి 34వ ర్యాంకు సాధించారు. డీఈడీ వరకు నకిరేకల్‌లోనే చదివిన ప్రశాంతి సార్వత్రిక విద్యలో డిగ్రీ, పీజీ పూర్తిచేశారు. కోచింగ్ తీసుకోకుండా ఇంటివద్ద ఉండి డీఎస్సీకి సిద్ధమయ్యాయని ప్రశాంతి మంగళవారం వివరించారు. తల్లిదండ్రులు, అత్తమామలు, భర్త కిరణ్‌కుమార్ ప్రోత్సాహం మరువ లేనిదని చెప్పారు.

ప్రత్యేక విద్యలో మొదటి ర్యాంకు


సి.హెచ్.భారవి

కేతేపల్లి ,న్యూస్‌టుడే: పేదరికంలో పుట్టి ప్రత్యేక విద్యలో పట్టభద్రుడై, ఉపాధ్యాయశిక్షణ పూర్తిచేసి కేతేపల్లి మండల వనరుల కేంద్రంలోని భవిత కేంద్రంలో ఒప్పంద ఉద్యోగి (ఐఈఆర్‌పీ) గా పనిచేస్తున్న సి. హెచ్.భారవి ఎస్జీటీ స్పెషల్ ఎడ్యూకేషన్ విభాగంలో జిల్లాలోనే మొదటి ర్యాంకు సాధించాడు. మానసిక, శారీరక వైకల్యంతో బాధపడుతున్న చిన్నారులకు ఆటపాటలతోపాటు వారికి అర్థమయ్యేరీతిలో విద్యను బోధించేందుకు ప్రభుత్వం మండలానికో భవిత కేంద్రాన్ని నిర్వహిస్తుంది. ఇందులో చిన్నారులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక విద్య అభ్యసించిన వారిని ఐఈఆర్‌పీలుగా నియమిస్తుంది. కేతేపల్లి భవిత కేంద్రంలో ఏడేళ్లనుంచి పనిచేస్తున్న భారవి మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో ఎస్జీటీ స్పెషల్ ఎడ్యూకేషన్ విభాగంలో జిల్లాలోనే ప్రథముడిగా నిలిచాడు. ఉత్తమ ప్రతిభ కనబరిన భారవిని ఎంఈవో రాజేంద్రప్రసాద్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాజరస్, సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల మహేందర్, ప్రతినిధులు సునీత, ఎ.మల్లయ్య, టి.హరి, పి. సైదులు, తదితరులు అభినందించారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ


రవీందర్

కట్టంగూరు, న్యూస్‌టుడే: కట్టంగూరు ఎస్సైగా ఎం.రవీందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన శ్రీను వీఆర్‌కు బదిలీ కాగ, రవీందర్ ట్రాన్స్‌కో శాఖ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

శాలిగౌరారం, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి సీజనల్ వ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంపీవో, ఏపీవో, ఉపాధిహామీ ఉద్యోగులు పాల్గొన్నారు

జమిలి ఎన్నికలు సాధ్యం కాదు: సీపీఎం

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్రం ఒకే భాష, ఒకే ఎన్నిక అనే నినాదంతో జమిలీ ఎన్నికలు నిర్వహించాలని ఆర్డినెన్సు తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధం అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి విమర్శించారు. వెలిమినేడులో మంగళవారం నిర్వహించిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్, శాసనసభతో పాటుగా జడ్పీటీసీ, సర్పంచి సహా ఒకే సారి ఎన్నికలు నిర్వహించాలనే ప్రభుత్వ యోచనను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. సీపీఎం సీనియర్ నాయకుడు బొంతల చంద్రారెడ్డి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పార్టీలో చేరిన పలువురికి కండువా కప్పి ఆహ్వానించారు. జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య, నెల్లికంటి నర్సింహ, మల్లం మహేశ్, అరూరి శ్రీనివాస్, కత్తుల లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి గ్రామీణం: యల్లారెడ్డిగూడంలో ఉన్న సర్వే నంబర్ 280 లోని 10.09 ఎకరాల ప్రభుత్వ భూమి పేదలకు కేటాయించడంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ గ్రామంలో సీపీఎం కార్యకర్తల సమావేశంలో మంగళవారం మాట్లాడారు. గతంలో 200 మంది పేదలను గుర్తించి పట్టాలు పంపిణీ చేసినా.. స్థలాల కేటాయింపు జరగలేదని గుర్తు చేశారు. ప్రభుత్వ స్పందించి ఈ భూమిని పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. దండు రవి, నాగరాజు, శంకర్, బాష, సైదులు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: రైతులకు రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా నాయకుడు బొల్ల నర్సింహారెడ్డి చెప్పారు. కొప్పోలు గ్రామంలో మంగళవారం సీపీఎం సమావేశం జరిగింది. పార్టీ మహిళా సంఘం జిల్లా నాయకురాలు బొల్ల జానకమ్మ ఎర్ర జెండాను ఎగురవేశారు. ఈరూ.2 లక్షల వరకు వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి లూర్దుమారయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, నాయకులు ఎల్.రాజు, కె.బాలయ్య, జి.సత్తిరెడ్డి, లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలని వినతి

చిట్యాల, న్యూస్‌టుడే: నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని సీపీఐ నియోజకవర్గ బాధ్యుడు లొడంగి శ్రవణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ పార్టీ నాయకులతో కలిసి చిట్యాల నాయబ్ తహసీల్దార్‌కు మంగళవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయన అందజేశారు. వ్యాపారులు నిత్యావసర సరకులను అక్రమంగా నిల్వచేసి, కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని విమర్శించారు. మండల, పట్టణ కార్యదర్శులు ఎండీ అక్బర్, ఎస్‌కే షరీఫ్, రావుల వెంకన్న, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

స్టడీ మెటీరియల్ అందజేత.. మర్రిగూడ: యూత్ ఫర్ సేవా నల్గొండ సహకారంతో నవనిర్మాణ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో మండల పరిధిలో కుదాబక్షుపల్లి, యరగండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ దరఖాస్తు చేసుకున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కర్నాటి శ్రీహరి, ప్రధానోపాధ్యాయులు మాలతి, రవీందర్‌రావు, యాదయ్య, దశరథ్, అలీ, రాము ఉన్నారు.

మునుగోడు: మండల పరిధిలోని యరగండ్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మండల విద్యాధికారి తల్లూరి శ్రీనివాస్, పాండు రంగారావు, మాలతి, శ్రీనివాసరెడ్డి, ఉదయశ్రీ, జ్యోతి, నరేష్ పాల్గొన్నారు.

ఎంఈవోకి సన్మానం.. గట్టుప్పల: గట్టుప్పల మండల ఎంఈవోగా అమృతాదేవి నియమితులయ్యారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు మంగళవారం ఆమెను కలిసి శాలువాతో సన్మానించారు. రవీందర్‌రావు, దామోదర్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింహ, కేశవులు, మల్లేశ్, శేఖర్, పరమేష్, మంజుల పాల్గొన్నారు.

నకిరేకల్: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడుగా ఎన్నికైన కందాళ పాపిరెడ్డిని నకిరేకల్ ఏపీఎం పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం సన్మానించారు. పాఠశాలల సమస్యలు పరిష్కారం కోసం తన వంతు కృషిచేస్తానని పాపిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.స్వప్నారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు.. మునుగోడు: స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి దక్కుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు ఆశాభావం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో మండల వ్యాప్తంగా రూ.54 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు మంజూరవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పాలాయాల చెన్నారెడ్డి, నారాయణ, దండు లింగస్వామి, స్వామి పాల్గొన్నారు.

వృద్ధులకు సన్మానం.. చిట్యాల: వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిట్యాలలోని రాఘవ్ విద్యాలయంలో సోమవారం పలువురు వృద్ధులను పాఠశాల యాజమాన్యం పండ్లు అందజేసి, శాలువాతో సన్మానించారు. ఆత్మీయ సాయాన్ని అందించారు. పాఠశాల ప్రిన్సిపల్ పెద్ది నరేందర్ పాల్గొన్నారు.

నల్గొండ అర్బన్: రక్తదానానికి మించిన మహాదానం లేదని వైద్యకళాశాల ప్రిన్సిపల్ శ్రీవాణి అన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రక్తదానం చేయటానికి యువత ముందుకు రావాలని కోరారు. రక్తం అందుబాటులో ఉండేలా దాతలు తీసుకుంటున్నట్లు సూపరింటెండెంట్ అరుణకుమారి తెలిపారు. ప్రమీల, సుధాకర్, సంపత్‌య, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

నార్కట్‌పల్లి గ్రామీణం: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలైన ఘటన విజయవాడ-హైదరాబాద్ జాతీయరహదారి-65పై గోపలాయపల్లి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు... గోపలాయపల్లికి చెందిన దండిగ యాదయ్య అనే వృద్ధుడు రోడ్డు దాటుతుండగా చిట్యాల వైపు నుంచి నార్కట్‌పల్లి వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడటంతో స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

గోశాల ఎద్దు మృతి

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: గోశాలలో ఉండే ఎద్దు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన చెర్వుగట్టులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గోశాలలో ఉండే మూగజీవాల కాపలాదారు మొత్తం ఏనిమిది ఆవులను, ఎద్దులను మేత కోసం తీసుకెళ్లాడు. అక్కడే ఉన్న పెద్ద బండ రాళ్ల మధ్యన కోడె చిక్కుకొన్ని మృతి చెందింది. గోశాల సమీపంలోని ఎకరం విస్తీర్ణంలో ఉన్న రాళ్లను తొలగించాలని పలు మార్లు ఆలయ అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని మాజీ ధర్మకర్త రేగట్ట మల్లిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

సినిమాలు
నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే
నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** సత్యం సుందరం, **వెంకటేశ్వర:** మత్తు వదలరా 2
నకిరేకల్: **రామకృష్ణ:** సత్యం సుందరం, **వెంకటేశ్వర:** దేవర

లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలి


మాట్లాడుతున్న ఎంజీయూ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ అంజిరెడ్డి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నల్గొండలోని నీలగిరి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల స్వాగతోత్సవ వేడుకలు మంగళవారం స్థానిక అశోకాగార్డెన్‌లో నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. విచ్చేసిన ఎంజీయూ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.అంజిరెడ్డి మాట్లాడారు. కృషి, పట్టుదలతో చదివితే జీవితంలో సాధించలేనిది ఏమీ లేదని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంజీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటరమణారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ మారం నాగేందర్ రెడ్డి, అధ్యాపకులు ఊట్కూరి మధుసూదన్‌రెడ్డి, పాల్గొన్నారు.

బంతి పూల విక్రయాలు


నల్గొండలో గడియారం వద్ద ట్రాక్టర్‌పై బంతి పూలు విక్రయిస్తున్న రైతు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: బతుకమ్మ పండుగ కావడంతో పూలకు గిరాకీ పెరిగింది. వివిధ రకాల పూలు మంగళవారం సాయంత్రం నుంచి రోడ్లపై పోసుకుని విక్రయిస్తున్నారు. బంతి పూలు రూ.80 నుంచి రూ.120 వరకు ధర పలుకుతుంది. చామంతి, గులాబీలతో పాటు గునుగు, చామంతి, తోక చామంతి, తంగేడు, ఎర్రగన్నేరు, రుద్రాక్ష, బీర గుమ్మడి వంటి రంగురంగులపూలు బతకమ్మ కోసం కొనుగోలు చేయడానికి ప్రజలు రోడ్డపైకి వచ్చారు. రైతులు కొందరు వారు పండించిన బంతిపూలు తెంపి ట్రాక్టర్‌పై పోసుకొని వచ్చి నల్గొండలో విక్రయిస్తున్నారు.

3 నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కనగల్ ,న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రోత్సవాలు గురువారం నుంచి 12 వరకు దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయంలో వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో జిల్లపల్లి జయరామయ్య తెలిపారు. అమ్మవారు తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో దర్శనమిస్తుందన్నారు. గురువారం స్వర్ణకవచాలకృత సరస్వతి దేవిగా, శుక్రవారం బాలాత్రిపుర సుందరి దేవిగా, శనివారం గాయత్రిదేవిగా, ఆదివారం అన్నపూర్ణదేవిగా, సోమవారం లలితా త్రిపురసుందరి దేవిగా, మంగళవారం మహాలక్ష్మిదేవిగా, బుధవారం సరస్వతి దేవిగా, గురువారం దుర్గాదేవిగా(దుర్గాష్టమి), శుక్రవారం మహిషాసురమర్ధనిదేవిగా, శనివారం రాజరాజేశ్వరి దేవి(విజయదశమి)దర్శనమిస్తుందన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు అమ్మవారికి కుంకుమార్చన, తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని అర్చకులు నాగోజు మల్లాచారి, చిలకమర్రి శ్రవణ్‌కుమారాచార్యులు, గదే ఉమామహేశ్వర్‌రావు, దామోదర్‌రావు, ఫణి కుమార్, నాగరాజు, శ్రీను తదితరులు తెలిపారు.

మంత్రి సన్మానం



నాగిరెడ్డిని సన్మానిస్తున్న మంత్రి సీతక్క

నీలగిరి, న్యూస్‌టుడే: ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా వయోవృద్ధులకు సేవలందిస్తున్న మునగాల నాగిరెడ్డిని మంత్రి సీతక్క సన్మానించారు. మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమశాఖలో ఫీల్డ్ రెస్పాండ్ అధికారిగా పనిచేస్తున్న ఆయన్ను ప్రభుత్వం ఉత్తమ ఉద్యోగిగా గుర్తించి మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క సన్మానించారు. వయోవృద్ధుల సమస్యలను పరిశీలించి పరిష్కరించడంలో నాగిరెడ్డి చూపుతున్న చొరవను అభినందించారు. సేవలను మరింత విస్తరించాలని సూచించారు.

మంత్రి ఉత్తమ్‌కు పలువురి పరామర్శ


పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, శాసన మండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి,

హైదరాబాద్, న్యూస్‌టుడే: పితృవియోగం చెందిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో మంగళవారం పలువురు నాయకులు పరామర్శించారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, నాయకులు కనుమూరి బాపిరాజు, తదితరులు పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతిరెడ్డి దంపతులను ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు.


చండూరులోని గీతా విద్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు


చిట్యాల గ్రీన్‌గ్రోవ్ పాఠశాలలో..


నకిరేకల్: శాస్త్ర పాఠశాలలో..

పూల పండగ.. సంబరాలు నిండుగా

పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో మంగళవారం జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ప్రకృతి పరిరక్షణ బాధ్యతగా తీసుకోవాలనే సందేశం విద్యార్థులకు తెలియజేయడం కోసం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ప్రకృతి పూల పండుగ ప్రజల జీవితాలతో ఉన్న సంబంధాలను తెలియజేసే విధంగా ముందస్తు వేడుకలు నిర్వహించారు. –న్యూస్‌టుడే, బృందం:


చండూరులోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో..


నల్గొండ: విపస్య పాఠశాలలో..


నల్గొండ: ప్రేరణ పాఠశాలలో..


నల్గొండ డైట్ కళాశాలలో..


నల్గొండ మహిళా డిగ్రీ కళాశాలలో..


నల్గొండలో బతుకమ్మలతో యువతులు


నల్గొండలోని న్యూస్ పాఠశాలలో..


నల్గొండ కతాల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో..


నాంపల్లి : గాంధీజీ పాఠశాలలో..

మిర్యాలగూడ
•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తే చర్యలు

చింతపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.రమాకాంత్, ఎంపీడీవో సుజాత అన్నారు. మంగళవారం మండలంలోని నసర్లపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఇటుక బట్టీలను పరిశీలించారు. బండరాళ్లను తొలగించేందుకు బ్లాస్టింగ్ చేస్తున్నారని.. ఈ సమయంలో ఇళ్లు, వ్యవసాయ పొలాల్లో రాళ్లు పడుతుండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు తెలిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునీత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

? పట్టణంలోని హనుమాన్‌పేటలో వీధి దీపం వెలగకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. – సత్యనారాయణ, మిర్యాలగూడ

✔ వీధి దీపానికి మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

బీసీలంతా ఏకం కావాలి

మిర్యాలగూడ పట్టణం: అన్ని రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్న ప్రస్తుత తరుణంలో తమ హక్కుల సాధనకు బీసీలంతా ఒక్కతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందని బీసీ యువజన సంఘం రాష్ట్ర కా.ని. అధ్యక్షుడు తిరుమలగిరి అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

ఉత్సవాలు విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: దసరాను పురస్కరించుకుని పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు ధనయ్య కోరారు. మంగళవారం వాసవీమాత ఆలయంలో అందుకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి శ్రీనివాస్, లక్ష్మయ్య, నర్సింహ, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల సందర్భంగా ముద్రించిన పుస్తకాలను విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

తాగు, సాగునీరు అందించాలని డిమాండ్

దేవరకొండ, న్యూస్‌టుడే: మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించేందుకు చేపట్టిన ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో జరిగిన సీపీఎం మహాసభలో పాల్గొని మాట్లాడారు. వెంకయ్య, లింగయ్య, ఎం.డి.రహీం, నాగటి నాగరాజు, వెంకటేశం, అంజి, నర్సింహ తదితరులున్నారు.

చందంపేట: పేదల ఇళ్లకు పునరావాసం కల్పించిన తర్వాతే వాటిని కూల్చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య అన్నారు. పేర్వాల, కేతేపల్లిలలో నిర్వహించిన సీపీఎం శాఖ మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. నాగరాజు, కాశయ్య, ధనయ్య, వెంకటయ్య, ఇందిర, లక్ష్మమ్మ, దుర్గా, చంద్రునాయక్ ఉన్నారు.

నడినెత్తినే..
యమపాశాలు..!

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే:



కాలిపోయిన విద్యుత్ బోర్డు

విద్యుత్ ప్రమాదాలు జరిగితేనే ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టించుకుంటారా అని స్థానిక వినాయక్‌నగర్ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం స్థానిక హైదరాబాద్‌రోడ్డులో గల విద్యుత్ ఉపకేంద్రం నుంచి నాంపల్లి మండలానికి విద్యుత్ సరఫరా చేసే 133 కేవీ విద్యుత్ తీగలలో ఒకటి తెగి పక్కనే ఉన్న చెన్నారం గ్రామానికి సరఫరా చేసే 11 కేవీ విద్యుత్ తీగలతో పాటు సమీప గృహాలకు సరఫరా అయ్యే విద్యుత్ లైన్లపై పడింది. దీంతో మంటలు చెలరేగి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆ సమయంలో అక్కడ ఎవరైనా ఉంటే విద్యుదాఘాతానికి గురయ్యేవారని కాలనీవాసులు వాపోయారు. తెగిన తీగల వల్ల పక్కనే ఉన్న రఘుమారెడ్డి అనే వ్యక్తి ఇంట్లో పూర్తిగా వైర్లు కాలిపోయాయి. 133 కేవీ తీగలు ధ్వంసం కావడంతో తెగిపడే ప్రమాదముందని వెంటనే మరమ్మతులు చేయాలని, లేదా విద్యుత్ లైన్‌ను పూర్తిగా ఇళ్ల మధ్య నుంచి తీసివేయాలని పలుసార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆ కాలనీవాసులు వాపోయారు.



ఇళ్లకు సరఫరా అయ్యే విద్యుత్ వైర్లపై పడిన 133 కేవీ విద్యుత్ తీగ

అప్పుడే బయటకు వెళ్లా..: రఘుమారెడ్డి

నేను అప్పుడే భోజనం చేసి ఇంటి నుంచి బయటకు వెళ్లాను. ఇంట్లోనే ఉంటే విద్యుదాఘాతానికి గురయ్యేవాన్ని. మూడు నెలలుగా సమస్యను పరిష్కరించాలని కొండమల్లేపల్లి, నాంపల్లి విద్యుత్ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదు.

సమస్య దృష్టికి వచ్చింది: శివప్రసాద్, డిస్కం ఏఈ, నాంపల్లి

ఇటీవలే సమస్య మా దృష్టికి వచ్చింది. అక్కడి నుంచి 133కేవీ విద్యుత్ లైన్ పూర్తిగా తీసివేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. అది 133 కేవీ కాబట్టి తీసివేయడం సాధ్యం కాదు. మరమ్మతులు చేపట్టాలని ఇటీవలే సిబ్బందితో మాట్లాడాను. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

త్రిపురారం, న్యూస్‌టుడే: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాజపా కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీను, నర్సిరెడ్డి, జానీ, కోటయ్య, లింగమ్మ, కాశయ్య, నవనీత, తదితరులు పాల్గొన్నారు.



'తొమ్మిది నెలల్లోనే విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్'

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే కాంగ్రెస్ ప్రజా విశ్వాసం కోల్పోయిందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి టి.వీరేందర్‌గౌడ్ విమర్శించారు. మిర్యాలగూడ పట్టణంలో పార్టీ సభ్యత్వ నమోదుపై ముఖ్య కార్యకర్తలతో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి విద్యాసాగర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, ప్రసాద్, సరిత, జనాబాయి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం రెడ్డీకాలనీలో ఇంటింటి సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కు పలువురి పరామర్శ

హైదరాబాద్, న్యూస్‌టుడే: పితృవియోగం చెందిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో మంగళవారం పలువురు నాయకులు పరామర్శించారు. శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, నాయకులు కనుమూరి బాపిరాజు, తదితరులు పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతిరెడ్డి దంపతులను ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు.



పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి, ఎం చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయుడు.. గ్రామస్థుల ఆగ్రహం

తిరుమలగిరి సాగర్: మండలంలోని శిల్గాపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు సీతారాం సొంత ప్రయోజనాల కోసం జిల్లా స్థాయి అధికారుల సిఫార్సుతో విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులకు తెలియకుండా డిప్యుటేషన్‌పై వెళ్లడంతో పిల్లల తల్లిదండ్రులు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఉపాధ్యాయుడు సైదులు పాఠశాలపై అవగాహన కల్పించి ఎక్కువ మంది పిల్లలను బడిలో చేర్పించారు. ఇక్కడ గతంలో ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో వారి స్థానంలో సీతారాం, రమణ ఉపాధ్యాయులు వచ్చారు. ఈ సమయంలో ఉపాధ్యాయుడు డిప్యుటేషన్‌పై వెళ్తే సిలబస్ ఎలా పూర్తవుతుందని నిరసన వ్యక్తం చేశారు. ఈవిషయాన్ని మండల విద్యాధికారి శ్రీనివాస్.. జిల్లాస్థాయి విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లగా.. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వయోవృద్ధులకు సన్మానం



వృద్ధులను సన్మానించిన యోగ ప్రతినిధులు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పతంజలి యోగ సాధన సంస్థలో మంగళవారం వయోవృద్ధులకు సన్మానించారు. ఈ సందర్భంగా యోగ గురువు పోలిశెట్టి లక్ష్మయ్య మాట్లాడుతూ అనుభవం కలిగిన వారి సూచనలను నేటి తరం పాటించాలన్నారు. సూర్యప్రకాశరావు, మురహరి, భాగ్యలక్ష్మి, నారాయణరెడ్డి, గోపయ్య, ఆదినారాయణ, లింగయ్య, రామ్మూర్తి, గోపయ్య, అరుణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడలోని ఎంపీయూపీఎస్-గాంధీపార్కు పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని కుర్ర శ్రీదేవి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కురువ తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థినిని అభినందించి మాట్లాడారు. త్వరలో ఆదిలాబాద్‌లో జరిగే పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రవీణ్, రాంరెడ్డి, చారి, కిరణ్‌కుమార్, ఎలీషా, పాల్గొన్నారు.



మిర్యాలగూడలో శ్రీదేవిని అభినందిస్తున్న గాంధీపార్కు పాఠశాల సిబ్బంది

బాధ్యతల స్వీకరణ

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న మోసిన్‌బిన్ అహ్మద్ ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవో పనిచేసిన కరుణాకర్‌రావు వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవుపై వెళ్లడంతో మంగళవారం మోసిన్‌బిన్ అహ్మద్ అదనపు బాధ్యతలు స్వీకరించారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘువ: దేవర, **వెంకటేశ్వర:** దేవర, **శ్రీనివాస:** సత్యం సుందరం, **విట్రోస్:** మత్తు వదలరా-2, దేవర, సత్యం సుందరం

కాల్వలోకి దూసుకెళ్లిన పాఠశాల బస్సు.. తప్పిన ప్రమాదం

మిర్యాలగూడ పట్టణం, మిర్యాలగూడ గ్రామీణం: దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న విద్యార్థుల బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన కాల్వలోకి దూసుకెళ్లి.. పలువురికి స్వల్ప గాయాలైన ఘటన మంగళవారం మిర్యాలగూడ మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి శివారులోని వీవీఆర్ సిటీ సెంట్రల్ పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు పాఠశాల బస్సులో మండల పరిధిలోని అవంతీపురంలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో బస్సు బ్రేకులు పడకపోవడంతో అదుపు తప్పి ఓ ఇంటి ప్రహరీను ఢీకొట్టి రోడ్డు పక్కన కాల్వలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో పలువురు విద్యార్థులకు గాయాలు కావడంతో పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. కాగా ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్ ప్రాంతీయ ఆసుపత్రికి చేరుకుని గాయపడిన విద్యార్థులను పరామర్శించారు. కాగా ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎంవీఐ లాల్‌కోట వీరస్వామి బస్సుకు 2022 నుంచి ఫిట్‌నెస్ లేదని, ఎటువంటి పత్రాలు లేవని గుర్తించారు. బస్సుకు బ్రేకులు సక్రమంగానే పని చేస్తున్నాయని. . డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు గుర్తించామన్నారు. బస్సును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన విద్యార్థిని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ పెండెం సైదులుపై కేసు నమోదు చేసినట్లు మిర్యాలగూడ గ్రామీణ ఎస్సై లోకేశ్ తెలిపారు.



విద్యార్థినికి అందిస్తున్న చికిత్సను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

డీఎస్సీ ఫలితాల్లో ర్యాంకుల సాధన

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఉరుమళ్ల గీత స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ విభాగంలో 60 మార్కులు సాధించి సూర్యాపేట జిల్లా స్థాయిలో 19వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం ఆమె సర్వశిక్ష అభియాన్‌లో రిసోర్స్ పర్సన్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు... పట్టణానికి చెందిన తోట జ్యోతి స్కూల్ అసిస్టెంట్(గణితం) విభాగంతో పాటు ఎస్జీటీ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకులు సాధించారు. చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండే జ్యోతి పదో తరగతి, ఇంటర్, టీటీసీ ఫలితాల్లో సైతం జిల్లా, రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయినిగా పని చేస్తున్న ఆమె డీఎస్సీ ఫలితాల్లో ఎస్ఏ, ఎస్జీటీ విభాగాలు రెండింట్లోనూ జిల్లా ప్రథమ స్థానం సాధించడం పట్ల పలువురు అభినందించారు.



నాణ్యమైన వైద్య సేవలందించండి: జూలకంటి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడలోని ప్రాంతీయ ఆసుపత్రికి వచ్చే పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆసుపత్రిని పరిశీలించి రోగులను చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డయాలసిస్ రోగులు అధికంగా వస్తున్నందున రక్తశుద్ధి యంత్రాలను పెంచాలని సూచించారు. ఆయన వెంట మల్లేష్, వెంకటేశ్వర్లు, రవినాయక్, గౌతంరెడ్డి, వినోద్‌నాయక్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మిర్యాలగూడ ప్రాంతీయ వైద్యశాలలో రోగులతో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నివాళి.. మిర్యాలగూడ గ్రామీణం: మండల పరిధిలోని ఆలగడపకు చెందిన సీపీఎం నాయకుడు గూడా అనంతరాములు వర్ధంతి సందర్భంగా స్తూపం వద్ద మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పార్టీ నాయకులతో కలసి నివాళులర్పించారు. సీపీఎం పార్టీ రాష్ట్ర నాయకులు మల్లేష్, వెంకటేశ్వర్లు, రవి నాయక్, గూడా నాగేంద్రప్రసాద్, కుటుంబ సభ్యులు, తదితరులు ఉన్నారు.

తెలుగు సాహితీ సుగంధం పుస్తకావిష్కరణ

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సహాయచార్యులుగా విధులు నిర్వహిస్తున్న జి.కోటేష్ రచించిన తెలుగు పోటీ పరీక్షల ' 'తెలుగు సాహితీ సుగంధం" పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామావత్ రవి మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో పనిచేస్తూ విద్యార్థుల కోసం తమ సమయాన్ని కేటాయించి తెలుగు సాహితీ సుగంధం అనే పుస్తకాన్ని రాయడం గొప్పవిషయమన్నారు. జి.లింగారెడ్డి, సీహెచ్.లింగమయ్య, రాజారాం, ఎం.ప్రభాకర్, రేణుక, ఎస్.కె.ఆరిఫా తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: వివిధ స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని జనయేత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మునీర్ అహ్మద్ షరీఫ్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ రాజు, డాక్టర్ బాలాజీ, డాక్టర్ తులసీరాం, డాక్టర్ రోహిత్, డాక్టర్ నాగునాయక్, డాక్టర్ వికాస్ కుమార్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.





దేవరకొండలో కృష్ణవేణి పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



చింతపల్లిలోని మాతృశ్రీ పాఠశాలలో ...



చింతపల్లిలో చిన్నారులు



కొండమల్లేపల్లి: రెయిన్‌బో ఆంగ్లమాధ్యమ పాఠశాలలో మహిషాసురమర్దిని నాటకంలో విద్యార్థులు

ఆకట్టుకున్న విద్యార్థుల ఆట.. పాట

మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లోని పట్టణాలు, మండలాల్లోని వివిధ పాఠశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో వచ్చి బతుకమ్మలు ఆడుతూ.. నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. పలు పాఠశాలల్లో ఎమ్మెల్యే బీఎల్ఆర్ విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానికంగా ఉన్న చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, బృందం



మిర్యాలగూడ శిష్య పాఠశాలలో...



త్రిపురారంలో..



హాలియాలో..



మాడ్గులపల్లి: వేములపల్లిలో..